
క్లుప్తంగా

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి స్వామివారు

పెదపూడి: జి.మామిడాడ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణ మూర్తి ఆలయంలో స్వామివారికి ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటనరసింహాచార్యులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

నేడు చంద్రశేఖరస్వామికి అభిషేకాలు

రంగంపేట: మండలంలోని చంద్రేడు కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా తెల్లవారుజామున 3.30 గంటల నుంచి అభిషేకాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకోవాలని కోరారు.

అన్నసమారాధన


అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు

సీతానగరం: ఇనుగంటివారిపేట షిర్డీ సాయిబాబా మందిరం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 180 మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సాయి సేవా సమితి ఇనుగంటివారిపేట చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్యం రామ్మోహన్‌రావు మాట్లాడుతూ 2008లో శ్రీ షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ చేసిన నుంచి ఏటా కార్తిక మాసంలో ప్రతిరోజూ 150 మందికి పైగా అన్నదానం చేస్తున్నామన్నారు. ట్రస్ట్, దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- 60 వేల మందికి పైగా రాక
- 5,200 వ్రతాలు, రూ.60 లక్షల ఆదాయం
- క్యూ కంపార్ట్‌మెంట్లలో భక్తుల ఇబ్బందులు

అన్నవరం: కార్తిక మాస తొలి ఆదివారం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని సన్నిధికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆదివారం సెలవుదినం కావడం, ఉదయం 7–30 గంటల నుంచి సప్తమి పర్వదినం రావడంతో ఈ రద్దీ ఏర్పడింది. భక్తుల రాకతో దేవస్థానం ఘాట్‌రోడ్లు, పార్కింగ్ ప్రదేశాలు కిక్కిరిసి ట్రాఫిక్ స్తంభించింది. సత్యదేవుని ఆలయం, వ్రత మండపాలు, ఆలయ ప్రాంగణం, ఎక్కడ చూసినా భక్తజనమే దర్శనమిచ్చారు. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. సత్యదేవుని వ్రతాలు సాయంత్రం ఐదు గంటల సమయానికి సుమారు 5,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికార్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ దేవస్థానంలో పలు విభాగాలు సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ టీవీలలో భక్తుల రద్దీ దృశ్యాలను పరిశీలించిన ఈఓ సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చారు.

తెల్లవారుజాము ఒంటి గంట నుంచి వ్రతాలు, దర్శనాలు

శనివారం రాత్రికే సుమారు పది వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకోవడంతో ఆలయాన్ని ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తెరిచి వ్రతాలు ప్రారంభించి, స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రతమండపాలు, నిత్య కల్యాణ మండపం, పాత కల్యాణ మండపాలు, వ్రతాలు ఆచరించే భక్తులతో నిండిపోయాయి. దీంతో స్వామివారి నిత్య కల్యాణమండపం, పాత కల్యాణ మండపంలోనూ నిర్వహించారు. స్వామివారిని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు.


నిత్యకల్యాణ మండపంలో స్వామివారి వ్రతాలాచరిస్తున్న భక్తులు


దర్శనం క్యూ కంపార్ట్‌మెంట్‌లో వేచియున్న భక్తులు


కమాండ్ కంట్రోల్ రూమ్ లో సీసీ టీవీలలో భక్తుల రద్దీ దృశ్యాలు పరిశీలిస్తున్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్

నేడు కూడా తీవ్ర రద్దీ!

కార్తిక సోమవారం పర్వదినం సందర్భంగా రత్నగిరిపై తీవ్ర రద్దీ నెల కొనే అవకాశం ఉంది. సుమారు 80 వేలకు పైగా భక్తులు స్వామివారి ఆలయానికి వచ్చే అవకాశం ఉంది. దీంతో తెల్లవారుజామున ఒంటి గంటకే స్వామివారి వ్రతాలు ప్రారంభిస్తారు. స్వామివారి దర్శనాలు తెల్లవారుజామున మూడు గంటల నుంచి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

సుమారు పది వేల మంది భక్తులకు పులిహోర దధ్యోజనం పంపిణీ చేశారు. సుమారు 60 వేల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. వ్రతాల ద్వారా రూ.30 లక్షలు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.12 లక్షలు ఆదాయం రాగా, మిగిలిన విభాగాల ద్వారా రూ.20 లక్షల ఆదాయం వచ్చిందని అంచనా వేశారు.

క్యూ లైన్ల కంపార్ట్‌మెంట్లలో తోపులాట, తొక్కిసలాట, భక్తుల ఆగ్రహం

నూతనంగా నిర్మించిన క్యూ లైన్ కంపార్ట్‌మెంట్లలో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వాటిలో మంచినీటితో సహా సరైన వసతులు లేకపోవడం, ఎక్కువ సేపు వేచి ఉండాల్సి రావడంతో భక్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేవస్థానం అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు ఈ పరిస్థితి నెలకొంది. దీంతో అంతరాలయ దర్శనాన్ని కొంత సేపు నిలిపివేసి భక్తులకు బయట నుంచే దర్శనానికి అనుమతించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన పూజలు

బిక్కవోలు: కార్తిక మాసం మొదటి ఆదివారం పురస్కరించుకుని మండలంలోని కొంకుదురు శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పడాల వీర వెంకట సూర్రెడ్డి, శాంతాదేవి దంపతులు నిర్వహణలో అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్న సమారధన చేశారు. కార్యకమంలోని ఎంపీటీసీ కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు.

నేడు దొడ్డిగుంటలో వై ఏపీ నీడ్స్ జగన్

రంగంపేట: మండల పరిధిలోని దొడ్డిగుంటలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సచివాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

కొంకుదురు బుడతల మామిడిలో సందడే సందడి


కొంకుదురులో కళ్లకు గంతలు ఆడుతున్న చిన్నారులు

బిక్కవోలు: కార్తిక మాసం తొలి ఆదివారం కావడంతో మండలంలోని కొంకుదురు బుడతలమామిడి వద్ద సందడి నెలకొంది. పందలపాక, కొంకుదురు, వెదురుపాక, రాయవరం తదితర గ్రామాల నుంచి అనేక కుటుంబాలు, విద్యార్థులు వచ్చి కార్తిక వనసమారాధనలు నిర్వహించుకున్నారు. వివిధ రకాల ఆటపాటలతో రోజంతా సరదాగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ కలయికలో పాల్గొన్న 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో కేఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా సుమారు 26 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరిగి నాటి సంగతులన్నీ స్మరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి


కొంకుదురు గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచి వీరమణి


వీరనారీమణుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: స్త్రీలు అన్ని రంగాల్లోనూ రాణించాలని కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. ఆదివారం కొంకుదురు శాఖా గ్రంథాలయంలో జరిగిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దిశ చట్టం, మహిళ సాధికారతపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, గ్రంథాలయ అధికారి నందికోళ్ళ బాల తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: స్త్రీ చైతన్యం సమాజ ప్రగతికి మూలమని లైబ్రేరియన్ ఎన్. రామకోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందిరాగాంధీ, సరోజినీనాయుడు, ఝాన్సీలక్ష్మీబాయి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. పోటీలకు రిటైర్డు ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఉద్యోగి పీవీ ప్రసాద్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

ఇందిరాగాంధీకి నివాళి


ఇందిరగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మధురపూడి: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కోరుకొండ శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి వీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు జీవీఎస్ రవీంద్ర మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణ, దేశాభివృద్ధికి మాజీ ప్రధాని కృషి చేశారన్నారు. అలాగే సండే స్టోరీ టైమ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో నీతి పుస్తకాలు చదివించి, వాటిని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రాజ, గాదరాడ, శ్రీరంగపట్నం నిక్షిప్త కేంద్ర నిర్వాహకులు కందికట్ల ఆనందకుమార్, బొడ్డేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

93 కిలోల గంజాయి స్వాధీనం

- వాహనంతో పాటు వ్యక్తిని
- అదుపులోకి తీసుకున్న పోలీసులు


బొలెరో వాహనాన్ని, గంజాయితో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నల్లజర్ల: ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్ర షోలాపూర్‌కు ఎగుమతి అవుతున్న 93 కిలలో గంజాయిని ఆదివారం మధ్యాహ్నం అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద నల్లజర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నున్న రాజు కథనం ప్రకారం తమకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వాహనంతో పాటు సరకు రవాణా చేస్తున్న మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కిశోర్‌కుమార్ సమక్షంలో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. దాడిలో ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి రేపటి గెలుపునకు నాంది : ఎంపీ భరత్

ప్రకాశంనగర్: అహ్మదాబాద్ నరేంద్రమోదీ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆస్ట్రేలియా వెర్సస్ ఇండియా జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్ ఓటమి చవిచూడడంతో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఒకింత నిరుత్సాహ పడినట్టు కనిపించినా.. విజయం సాధించిన ఆస్ట్రేలియా జట్టుకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. ఆదివారం రాత్రి ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ ఇది ఊహించని ఫలితం అన్నారు. ఆటలో ఎవరో ఒకరు మాత్రమే గెలుస్తారని, దేనినైనా పోటీతత్వంతో స్వీకరించాలన్నారు. భారతీయులు ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధిస్తుందని ఆశించారని వారి ఆశలు కలలు ఫలించేలా టీమ్ ఇండియా జట్టు శత విధాలా ప్రయత్నించిందన్నారు. టీం ఇండియా కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఓటమి విజయానికి నాంది అన్నారు. నగర వాసులు ఎంతో ఉత్సాహంగా ఆర్ట్స్ కళాశాలకు వచ్చి క్రికెట్ మ్యాచ్‌ను తిలకించినందుకు ఎంపీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి మనిషీ ప్రేమ, కరుణ కలిగి ఉండాలి


సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి మనిషీ ప్రేమ, దయ, జాలి, కరుణతో ఉండాలని ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. కొంతమూరు శానిటోరియం దగ్గర సీయోను స్వస్థశాల షోరోన్ గృహంలో రాకడ సిద్ధపాటు ఉజ్జీవ మహిమ సభలు బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో సంఘ కాపరులు రెవరెండ్ పి.ఎర్నెస్ట్ మోజస్ నేతృత్వంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ జాన్ వెస్లీ మాట్లాడుతూ బైబిల్ మిషన్ ద్వారా జరుగుతున్న దేవుని సేవ, సామాజిక సేవలను అభినందించారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా క్రైస్తవులు ఇక్కడ సుఖ సంతోషాలతో మెలుగుతున్నారంటే దానికి ముఖ్య కారణం క్రైస్తవులపై సీఎం జగన్‌కు ఉన్న నిబద్ధత చిత్తశుద్ధి వల్లనేనని చెప్పారు. సంఘ కాపరులకు మూడో విడత గౌరవ వేతనం అందించేలా త్వరలోనే నిర్ణయం తీసుకుంటారన్నారు. సభకు రెవరెండ్ పి.జాన్ పాల్ అధ్యక్షత వహించగా, వాక్యోపదేశకులు రెవరెండ్ ఎం.విజయ సారథి, ఏపీ ఎస్‌సీ ఎంఎఫ్‌సీ డైరెక్టర్ కొండ జాన్ వెస్లీ, క్రైస్తవులు పాల్గొన్నారు.

వైభవంగా వీరుళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


వీరుళమ్మ మూలవిరాట్ వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: కోరిన కోర్కెలు తీర్చే అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ వారి నూతన ఆలయ ప్రవేశం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా వేదపండితులు ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, గర్తన్యాసము, రత్నన్యాస, కరన్యాస హోమాది క్రతువులు, పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, ప్రముఖ నేత్రవైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి, మస్తానమ్మ దంపతులతో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భారీ ఎత్తున జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు 10 వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ద్రాక్షారామ శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం, కర్రి ధర్మారెడ్డి, మంగయ్యమ్మ, ఎన్‌సీఆర్ మురళి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లతో మానవ సంబంధాలకు ముప్పు


మాట్లాడుతున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆధునిక సమాజంలో మానవ సంబంధాలను మొబైల్ ఫోన్లు దెబ్బతీస్తున్నాయని, దీనిని అవసరం మేరకే వాడుకుంటే తరిగిపోతున్న అనుబంధాలను తిరిగి పొందవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు సూచించారు. సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద ఆదివారం నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు టి.కె.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వీసీని సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, ఏపీ పరిశ్రమల శాఖ డైరెక్టర్ కానుబోయిన సాగర్, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రె కొండబాబులను కూడా సత్కరించారు. రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ తేతలి స్వరూపారెడ్డి దంపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపకుడు ఆవంత్స

అరసం జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న అరసం జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

పిఠాపురం: సమసమాజ స్థాపనకు 82 ఏళ్ల పాటు తన రచనల ద్వారా పాటుపడిన మహోన్నతుడు ఆవంత్స సోమసుందర్ అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆవంత్స సోమసుందర్ లిటరసీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆవంత్స శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత గలిగిన రచయితగా సామాజికి మార్పు కోసం ఆవంత్స రచనలు చేసారన్నారు. మరో ముఖ్య అతిథి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్ మాట్లాడుతూ మనిషిని నడిపించేది ఒకటి సైన్సు అయితే రెండోది సాహిత్యం అన్నారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడంలో సోమసుందర్ ఎంతో కృషి చేసారన్నారు. సాహిత్యానికి, కళలకు నేటి యువత దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరం సోమసుందర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెలికాని స్టాలిన్ పీఆర్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భరతలక్ష్మి, సహృదయ మిత్ర మండలి సభ్యులు పి.పావని, యువ రచయిత కిలారి గౌరీనాయుడు, రచయిత గౌరవ్, సోమసుందర్ లిటరసీ ట్రస్టు సభ్యులు డాక్టర్ గజరాజు సీతారామస్వామి, మేకా మన్మధరావు, ఆవంత్స విజయ శేషేంద్ర, శాతకర్ణి, గట్టి శ్రీకృష్ణదేవ రాయలు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, తటవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బలభద్రపురంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై బుజ్జిబాబు

బిక్కవోలు: మండలంలోని రోడ్డు ప్రమాదంలో షేక్ మౌలాలి (28) మృతి చెందినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రంగంపేట మండలం ముకుందవరం గ్రామానికి చెందిన మౌలాలి కొమరిపాలెం గ్రామంలోని సూర్య మోడరన్ రైస్‌లో కూలిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే పని ముగించుకుని శనివారం రాత్రి ఇంటికి వస్తుండగా బలభద్రపురం గ్రామశివార్లలో మురళిమోహన్ గొడౌన్స్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అతడు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని ఎస్సై బుజ్జిబాబు పరిశీలించి అనపర్తి సీహెచ్‌సీ తరలించి పోస్టుమార్టం చేశారు. మౌలాలి అన్నయ్య షేక్ లాల్ జానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

రంగంపేట: నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి. విజయకుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట మండలం మర్రిపూడి గ్రామానికి చెందిన చంద్రమల్ల శ్రావణిని అదే గ్రామానికి చెందిన కాతేటి ఆనంద్‌కుమార్ గత మూడేళ్లుగా ప్రేమిస్తున్నానని నమ్మించి ఆమెను శారీరకంగా అనుభవించాడు. ఇప్పుడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గురువుకు సత్కారం

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని గోగులమ్మ తల్లి ఆలయం వద్ద శిల్పిలు తమ గురువును ఘనంగా సత్కరించుకున్నారు. ఆదివారం నిర్వహించుకున్న కార్తిక వనసమారధనలో తమకు ఆది గురువైన కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి, సూరయ్యమ్మ దంపతులను శిల్పిలు కొల్లి పెద్ద వీర్రాఘవ, చిన్న రాఘవ తదితరులు సత్కరించారు.

ఆలయాలకు కార్తిక శోభ

- సోమవారం పూజలకు ముస్తాబైన శివాలయాలు
- రూ.25 లక్షలతో గోకవరంలో శివాలయం ఆధునీకరణ
- కొత్తపల్లిలో 300 ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్డిరాజుల కాలం నాటి శివాలయం


కొత్తపల్లిలో రెడ్డి రాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి ఆలయం


గోకవరంలో అభివృద్ధి చేసిన రామలింగేశ్వరస్వామి ఆలయం

గోకవరం: ఆలయాలు కార్తిక శోభను సంతరించుకున్నాయి. కార్తిక మాసంలో మొదటి సోమవారం పూజలకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. మండలంలో స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, ఉమాగోకర్ణేశ్వరస్వామి, కొత్తపల్లి సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన రెడ్డి రాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి ఆలయం, తంటికొండలో అఖిలాండేశ్వరి సమేత జంభుకేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధిగాంచినవి.

శివాలయం అభివృద్ధి

గోకవరం ప్రధానరహదారికి ఆనుకుని ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి సైతం సుమారు వందల సంవత్సరాలకు పైబడి చరిత్ర ఉంది. ఆలయం తూర్పు ముఖంగా కోనేరు ఉంది. ఏటా కార్తికమాసంలో మహిళలు ఈ కోనేటిలో దీపాలు వదులుతారు. కాగా ఈ ఆలయాన్ని ఇటీవల రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. ఆలయ మండపాన్ని, ధ్వజస్తంభాన్ని పునర్నిర్మించారు. కోనేటిని అభివృద్ధి చేశారు. రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామికి సుమారు 200 వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఆలయంలో కొలువైన గోకర్ణేశ్వర స్వామి పేరుమీదే గ్రామానికి గోకవరం అనే పేరు వచ్చిందని భక్తుల నమ్మకం.

ముస్తాబైన రాజలింగేశ్వరస్వామి ఆలయం

కొత్తపల్లిలో సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయం ఉంది. రెడ్డిరాజుల కాలంలో ఈ శివాలయాన్ని నిర్మించినట్టు చరిత్ర ఆధారాలు ఉన్నాయి. ఇక్కడ స్వామి వారు బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామిగా భక్తులకు దర్శనమిస్తారు. ఆలయానికి విశేష చరిత్ర ఉండటంతో ఎండోమెంట్ శాఖ అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లోని శివాలయాల వద్ద పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.